క్లుప్తంగా

రూరల్ తహసీల్దార్‌గా జయప్రకాష్



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రూరల్ తహసీల్దార్ జయప్రకాష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూ సమస్యలు, అర్జీలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరి ఐరాలకు బదిలీ అయ్యారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం



తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురంలో గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగమ్మ ప్రతిమను మంగళవారం నడివీధిలో ప్రతిష్టాపన చేయించి అభిషేకం, పూజలు చేయించారు. అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి ధూప దీపనైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం సాయంత్రం అమ్మ వారికి భక్తులు పూజలు చేసి ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.

కొత్తపల్లెలో ఘనంగా గంగమ్మ జాతర



గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె ఆదిఆంధ్రవాడ గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతర ఘనంగా బుధవారంతో ముగిసింది. ఇందులో భాగంగా ఉదయం గంగమ్మకు ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ

పలమనేరు: పట్టణంలో బుధవారం 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ వేడుకగా నిర్వహించారు. వీహెచ్‌పీ, హిందూ సంఘాలు, పలు కళాశాలల విద్యార్థినులు, ఆర్యవైశ్య మహిళలు జాతీయ పతకాలతో ఈ ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై అంటూ దారి పొడవునా నినాదాలు చేస్తూ భారత్ త్రివిధ దళాల శక్తిని కీర్తించారు. అనంతరం ఓ కళ్యాణ మండపంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన మిలటరీ సిద్ధయ్య ఆపరేషన్ సిందూర్ విజయంపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు పట్టణ వాసులు పాల్గొన్నారు.

పులిగుండులో అలరించిన దుర్యోధన వధ

పెనుమూరు(కార్వేటినగరం): పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథాగానం చేశారు. అనంతరం దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శించారు. గంగమడుగులో దాగిన దుర్యోధనుని భీమసేనుడు వెలికి తీసుకువచ్చి హతమార్చే ఘట్ట ప్రదర్శనను కళాకారులు రక్తి కట్టించారు. ఒకరిపై మరొకరు కలియబడుతూ, పద్యాలు ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. ఈ ఘట్టానికి మాజీ సర్పంచ్ మేకల గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వధ అనంతరం నిర్వహించిన ధర్మరాజులు పట్టాభిషేకం కార్యక్రమానికి మహాసముద్రం ప్రతాపరెడ్డి, మహాసముద్రం సురేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి యాదవ్, కారేటి గోవిందరెడ్డి, కంచర్ల చక్రవర్తినాయుడు పాల్గొన్నారు.



దుర్యోధన వధ ఘట్టంలో తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

పీవీకేఎన్ కళాశాల వద్ద వాకింగ్ చేస్తున్న వారిని డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న పోలీసులు, కట్టమంచి చెరువుపై డ్రోన్ చిత్రం



డ్రోన్ నిఘా!

నగరంలో ఇటీవల ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. మహిళలు వాకింగ్ చేసేప్పుడు, రోడ్డుపై నడిచి వెళ్లేప్పుడు మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిపోతున్నారు. దీనికి చెక్ పెట్టడానికి చిత్తూరు పోలీసులు కొత్తగా ఆలోచించారు. మహిళలు వాకింగ్ చేసే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేసి.. నిత్యం అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. కట్టమంచి చెరువు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం, మెసానిక్ గ్రౌండ్ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పరిస్థితిని పర్యవేక్షించి, నిఘా ఉంచారు. పోలీసులు తీసుకున్న వినూత్న ఆలోచనలు ఎలాంటి ఫలితాలు ఇస్తాయో వేచి చూడాల్సి ఉంది. –చిత్తూరు అర్బన్

మామిడి రైతులను ఆదుకునేలా చూడండి

బంగారుపాళెం: మామిడి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని గ్రామ సభల్లో రైతులు పలమనేరు ఆర్డీఓ భవానీకి మొరపెట్టుకున్నారు. బంగారుపాళెం, గుంతూరు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ, మార్కెట్, ర్యాంప్‌లలో తోతాపురి(బెంగళూరా) మామిడి కిలో 3 నుంచి 4 రూపాయల వరకు మాత్రమే కొలుగోలు చేస్తున్నారని దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. జ్యూస్ ఫ్యాక్టరీల్లోనూ ఇదే పరిస్థితని తెలిపారు. జూస్ ఫ్యాక్టరీలకు సన్న, చిన్న కారు రైతులు కాయలు తరలించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. జూస్ ఫ్యాక్టరీ యజమానులు రైతుల నుంచి కిలో రూ.8కు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం నాలుగు రూపాయలు మద్దతు ధర రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని చెప్పిందన్నారు. ఆ దిశగా రైతులకు న్యాయం జరగడం లేదని వాపోయారు. జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం వద్ద పర్మిట్ల కోసం పడిగాపులు కాసినా ఫలితం లేదన్నారు. మామిడి రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. అనంతరం తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్‌తో కలసి ఆర్డీఓ బంగారుపాళెంలో మామిడి కాయల ర్యాంప్‌లను తనిఖీ చేశారు.



మామిడి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయస్వామి దేవస్థాన గో సంరక్షణ ట్రస్టుకు బుధవారం ఓ దాత నగదు విరాళం సమర్పించారు. తిరుపతికి చెందిన పంచజయన్ రూ. ఒక లక్ష నగదు విరాళంగా ఇచ్చుకున్నారు. ఆ నగదును ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం దాత కుంటుంబానికి ఆలయ అధికారులు దర్శనభాగ్యం కల్పించారు.



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

అర్జీలు వెంటనే పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్: విద్యుత్ వినియోగదారుల సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయం వరకు రావాల్సిన అవసరం లేదన్నారు. బిల్లులోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. అనంతరం బిల్లులు చెల్లించేందుకు వచ్చిన ఓ వినియోగదారునికి బిల్లులోని క్యూ ఆర్ కోడ్ ఎలా స్కాన్ చేసి బిల్లు ఎలా చెల్లించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2 అర్జీలు రాగా ఒక అర్జీని అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ డీఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

మామిడి పుష్కలం
రైతుకు నిష్ఫలం

- ర్యాంపుల వద్ద ఇష్టారాజ్యంగా ధరల నిర్ణయం
- క్రషింగ్ పూర్తయ్యే వరకు నో పర్మిట్ అంటున్న యాజమాన్యాలు



ర్యాంపుల వద్ద తమిళనాడుకు తరలించడానికి నిల్వ ఉంచిన మామిడి కాయలు

తవణంపల్లె: మామిడి రైతుల గుండెల్లో మంటలు రేగుతున్నాయి. కాయలను ఫ్యాక్టరీలకు తరలించడానికి రైతులు ఫ్యాక్టరీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడంలేదు. మండలంలో నాలుగు ఫ్యాక్టరీల్లో క్రషింగ్ జరుగుతోంది. రెండు వారాలుగా ఫ్యాక్టరీ యజమానులు అనుకూలమైన వారికి పర్మిట్లు ఇవ్వడంతో మామిడి కాయల ట్రాక్టర్లతో నిండిపోయాయి. కానీ ఫ్యాక్టరీ యజమానులు ధరలు నిర్ణయించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా పర్మిట్ల కోసం రైతులు ఫ్యాక్టరీల దగ్గర అన్నంలేక ఆకలితో పడిగాపులు కాస్తున్నారు. మామిడి తోటల్లో కాయలు మచ్చలు పడి రాలిపోతున్నా పర్మిట్లు ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీల వద్ద మామిడి కాయల లోడ్లుతో ఉన్న ట్రాక్టర్లు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉన్నాయి. కాయలు అన్‌లోడ్లు చేయడానికి 36 నుంచి 48 గంటలు పడుతోంది. ర్యాంపుల దగ్గర రైతులు ఎలాగైనా మామిడి కాయలు అమ్మక తప్పదని భావించిన కొనుగోలుదారులు బుధవారం కిలో కాయలను రూ.2.25 నుంచి రూ.2.50కు కొనుగోలు చేస్తామని లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవచ్చని తెలిపారు. చేసేది లేక రైతులు కొందరు మనసు చంపుకుని అమ్మేసి వస్తున్నారు. మరికొందరు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం

ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటుందని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ప్రకటించారు. మండలంలోని దిగువ మాఘం సచివాలయంలో మామిడి రైతులతో సమీక్షించారు. రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మామిడి కాయలను కిలోకు రూ.4లు సబ్సిడీ తప్పక ఇచ్చి ఆదుకుంటుదన్నారు. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి కిలోకు రూ.8 ఇప్పిస్తామన్నారు. సీఈఓతో పాటు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, సర్పంచ్ గోపి, రైతులు పాల్గొన్నారు.







దిగువమాఘంలో రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, గాజులపల్లె సమీపంలో ర్యాంపుల వద్ద లారీలకు లోడ్లు చేస్తున్న మామిడి కాయలు, ఎఫ్-3 ఫ్యాక్టరీలో మామిడి కాయల వాహన బరువు చూస్తున్న సిబ్బంది

డీసీహెచ్‌ఎస్‌లో బదిలీల ఒప్పందం!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్‌లో బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆశాఖకు సంబంధించిన యూనియన్లు మండిపడుతున్నాయి. ఎవరైతే మామూళ్ల వసూళ్లు చేస్తూ.. కార్యాలయాన్ని నడిపిస్తున్నారో..వారికి పెద్ద పీట వేసేందుకు బదిలీలల్లో కుయుక్తులు పన్నుతున్నారంటూ ఆ వర్గాలు మండిపడుతున్నాయి. పాత స్థానంలో ఏళ్ల తరబడి పనిచేసిన సీటును వదులుకునేందుకు ఇష్టపడక.. మళ్లీ అదే స్థానానికి వచ్చేందుకు పలువురు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. శాఖ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంటూ...బదిలీ ప్రాంతానికి ఎవరు పెట్టించే పనిలో నిమగ్నమయ్యారంటూ విరుచుకుపడుతున్నాయి. అక్కడి నుంచి పాత స్థానానికి రప్పించుకునేందుకు శాఖలోని కొందరు అధికారులు చేస్తున్న కుట్రలను రాష్ట్ర స్థాయి అధికారులపై నెట్టేస్తున్నారు. 5 ఏళ్లకు పైబడిన వారిని బదిలీ అయినా ప్రాంతం నుంచి వెనక్కి రప్పించుకోవడం ఎలా సాధ్యమవుతోందని, అలా జరిగితే కచ్చితంగా బదిలీల గోల్‌మాల్‌ను బయటపెడతామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీనిపై డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిని వివరణ కోరగా...ఇంకా బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. పాత స్థానంలోకి వచ్చే విషయం మాకు సంబంధం లేదు. రాష్ట్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారని అని తెలిపారు.

అతిసారంపై అశ్రద్ధ వద్దు

ఐరాల: అతిసారం(డయేరియా)పై అశ్రద్ధ వహించకుండా అవగాహన పెంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వర్షాలకు కలుషితమైన నీరు తాగడం వల్ల అతిసారంతో జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. అతిసారం బారిన పడిన రోగులకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సబ్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో డయేరియా, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగీ తదితర కేసులను గుర్తించిన వెంటనే సమాచారం ఇవ్వాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

డెప్యుటేషన్లపై డాక్టర్లు



గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గుడిపాల: మండలంలోని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ నలుగురు డాక్టర్లు ఉండేవారు. ఒక డాక్టర్ ఓపీలో రోగులను వైద్య సేవలందిస్తూ ఆరోగ్య కేంద్రంలోని కార్యకలాపాలు చూసుకుంటారు. మరో డాక్టర్ 104 వైద్య సేవలకు సంబంధించి గ్రామాల్లోని రోగులకు వైద్యసేవలు అందించేందుకు వెళ్తుంటారు. ఇక్కడ ఉన్న ఇద్దరు డాక్టర్లను డెప్యుటేషన్‌పై పంపించేశారు. గుడిపాలలో పనిచేస్తున్న డాక్టర్ చంద్ర మహేష్‌ను చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్‌పేట ఆస్పత్రికి, బొమ్మసముద్రంలో పనిచేస్తున్న డాక్టర్ అనూష చిత్తూరు ఆస్పత్రికి డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఆయా ప్రాథమిక కేంద్రాల్లో ఒకే డాక్టర్ ఓపీ సేవలతో పాటు 104 వైద్యసేవలకు సంబంధించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరచూ ఆస్పత్రులకు గర్భవతులు వస్తుంటారు. గర్భవతులకు కాన్పులు చేయాలంటే డాక్టర్ ఉండాల్సిందే. అటువంటి సమయంలో 104 సేవలకు మంగళం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాటు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కనే ఈ రెండు ప్రాథమిక కేంద్రాలు ఉన్నాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు 104 వైద్య సేవల్లో ఉన్న డాక్టర్ వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్సలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 104 వైద్య సేవలకు డాక్టర్‌ను నియమించి గ్రామాల్లో వైద్యసేవలు అందించేవి. ఇంటింటికీ వెళ్లి రోగులకు చికిత్సలు చేసి వచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వైద్యుల కొరత రావడంతో రోగులు అల్లాడిపోతున్నారు. గతంలో 104 వైద్యసేవల్లో వైద్యులు సెలవు పెడితే బఫర్ డాక్టర్లను ప్రభుత్వం నియమించేది. ప్రస్తుతం ఆ ఊసే కనిపించడం లేదు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని డాక్టర్‌లను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



